భద్రాచలంలో బీఆర్‌ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత తదితరులు

శనివారం కుత్బుల్లాపూర్ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేటర్లు తదితరులు

కూకట్‌పల్లి సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్‌పై చీటింగ్ కేసు!

› మొదటిపేజీ తరువాయి...

కేకే ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తలకిందులు తపస్సు చేసినా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశానికి ప్రధాని కాలేరని ఎద్దేవా చేశారు. అబద్ధాలు చెప్పి, ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని చెప్పి, ఇప్పుడేమో కేంద్రంలో కూడా అధికారంలోకి వచ్చాక అమలుచేస్తామని మాట మారుస్తున్నారని ఆరోపించారు. ఎన్ని మాయ మాటలు చెప్పినా ప్రజలు ఇక కాంగ్రెస్‌ను నమ్మరని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు కాంగ్రెస్‌ను బీఆర్‌ఎస్ వెంటాడుతూనే ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, 6 లక్షల మంది ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వెల్లడించారు. ఒక్కో ఆటోడ్రైవర్‌కు నెలకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కతో జిల్లాప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆరోపించారు.

ఉగాది పండుగ లెక్క బీఆర్‌ఎస్

ఉగాది పండుగ ఎంత శ్రేష్టమైనదో, బీఆర్‌ఎస్ పార్టీ కూడా అంత గొప్పగా ఉంటుందని హరీశ్‌రావు అన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బీఆర్‌ఎస్ ప్రజల పక్షమేనని చెప్పారు. ఉద్యమాలు పార్టీకి కొత్తకాదని, తెలంగాణ తెచ్చుకున్నది బీఆర్‌ఎస్సేనని స్పష్టం చేశారు. నాటి ముఖ్యమంత్రులైన చంద్రబాబు నాయుడు, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి మెడలు వంచి రాష్ర్టాన్ని సాధించుకున్నామని, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని అన్నారు.

ఢిల్లీలో కొట్లాడేది బీఆర్‌ఎస్సే

తెలంగాణ ప్రయోజనాలకు ఢిల్లీలో కొట్లాడేది బీఆర్‌ఎస్ పార్టీయేనని హరీశ్‌రావు అన్నారు. బీజేపీతో జతకట్టిన కాంగ్రెస్.. సాగునీటి ప్రాజెక్టులను కేంద్రానికి తాకట్టు పెట్టిందని విమర్శించారు. దీన్ని కూడా కేంద్ర జల్‌శక్తి మంత్రి ముందు నిలదీసింది బీఆర్‌ఎస్ ఎంపీలేనని తేల్చి చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని రాష్ట్రంలో ఓడించింది బీఆర్‌ఎస్ పార్టీనేనని అన్నారు. బండి సంజయ్, అర్వింద్, ఈటల రాజేందర్ వంటి నాయకులను ఎన్నికల్లో ఓడించింది కారు గుర్తేనని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ చతికిలపడటం ఖాయమని వెల్లడించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ నాయకులు ఊర్లలోకి పోయే పరిస్థితి లేదని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భద్రాచలాన్ని ఆదర్శంగా తీసుకుని మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో తెలంగాణ గళం బీఆర్‌ఎస్సే

- **హక్కులపై ధైర్యంగా మాట్లాడేది గులాబీ దళం నాయకులే**
- **తల ఊపే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలతో ఆగమే**
- **మోదీ ఒక్క రూపాయి ఇవ్వకున్నా తెలంగాణను కే చంద్రశేఖర్‌రావు అభివృద్ధి చేయలేదా?**
- **కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సన్నాహక సమావేశాల్లో కేటీఆర్**

మేడ్చల్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించే ధైర్యం గులాబీ జెండాకే ఉన్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. తల ఊపే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలను గెలిపిస్తే తెలంగాణ ఆగం అవుతుందని హెచ్చరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ.. ఢిల్లీలో తెలంగాణ గురించి మాట్లాడే వారు ఉంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలకు నోరు పెగలదని, ఢిల్లీ, గుజరాత్ బాస్‌లకు చెప్పినదానికే తల ఊపుతారని ఎద్దేవా చేశారు. దూదూ బసవన్నల్లాంటి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను కాకుండా తెలంగాణ ప్రజల హక్కుల కోసం ధైర్యంగా కొట్లాడే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. తెలంగాణకు రావాల్సిన హక్కులు పొందేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలను గెలిపించుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మోదీ రూపాయి ఇవ్వకున్నా కేసీఆర్ అభివృద్ధి చేయలేదా?

పదేండ్లలో కేంద్రం నుంచి ప్రధాని మోదీ ఒక్క రూపాయి ఇవ్వకున్నా తెలంగాణ రాష్ర్టాన్ని కేసీఆర్ అభివృద్ధి చేయలేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. కేసీఆర్ హయాంలో 29 వేల లీటర్ల మంచినీటిని ఉచితంగా అందిస్తే, ఇప్పుడు మంచినీటికి చార్జీలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు పరిచేలా ఒత్తిడి తేవాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులను అధిక స్థానాల్లో గెలిపించాలని కోరారు. హామీల అమలుపై కాంగ్రెస్ చేతులు ఎత్తేస్తున్న పరిస్థితుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులకు ప్రజలు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే ప్రజల తరపున పోరాడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాభై రోజుల్లోనే ప్రజలకు విసుగు తెప్పిస్తున్నదని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, హెల్త్‌సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మమత వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా

- **కాంగ్రెస్ పార్టీ వల్లే ఇండియా కూటమి చెల్లాచెదురు**
- **బీజేపీని నిలువరించేది ప్రాంతీయ శక్తులే : కేటీఆర్**

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు దమ్ముంటే వారణాసిలో పోటీచేసి గెలవాలని, ఆ పార్టీ 40 స్థానాలను కూడా ఈసారి నిలబెట్టుకునే అవకాశం లేదంటూ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నట్టు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. బీజేపీని ఆపగలిగే శక్తి బలమైన ప్రాంతీయ రాజకీయ శక్తులకే ఉన్నదని పేర్కొన్నారు. కేసీఆర్, మమతాబెనర్జీ, కేజ్రీవాల్, స్టాలిన్ వంటి బలమైన నాయకులే బీజేపీని అడ్డుకోగలరని, కాంగ్రెస్ పార్టీ ఎంతమాత్రం కాదని ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. బీజేపీకి కాంగ్రెస్ ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని కాంగ్రెస్ వ్యవహారశైలి వల్లనే ఇండియా కూటమి చెల్లాచెదురు అవుతున్నదని, ఆ పార్టీ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు చెప్పారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ర్టాల్లో బీజేపీతో నేరుగా పోటీపడాల్సివున్న కాంగ్రెస్, ఆ రాష్ర్టాలను వదిలిపెట్టి ఇంతర రాష్ర్టాల్లో, ఇతర పార్టీలతో పోటీ పడుతున్నదని ఎద్దేవా చేశారు. దీనివల్ల బీజేపీకి లాభం చేకూరుతున్నదని, ఇండియా కూటమిలోని పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు.

అబద్ధాలతో కాంగ్రెస్‌కు అందలం

- **మొండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమిటి?: ఎమ్మెల్యే మల్లారెడ్డి**
- **నెలాఖరులోగా 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి: మాజీ ఎంపీ వినోద్ డిమాండ్**

గంగాధర, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విమర్శించారు. ఆ పార్టీ ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్‌లో శనివారం నిర్వహించిన చొప్పదండి నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. మిషన్ కాకతీయ కింద రాష్ట్రంలోని 40 వేల చెరువులకు పూర్వవైభవం తెచ్చి, కోటి ఎకరాలకు సాగు నీరందించారని గుర్తుచేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని మొండిసంజయ్ అనుకోవాలని, ఉత్తమాటలు తప్ప నిధులు తీసుకురావడం ఆయనకు తెలియదని విమర్శించారు. వినోద్‌కుమార్ లాంటి మేధావిని గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే అనేక అభివృద్ధి పనులకు నిధులు తీసుకొస్తారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేయడానికి కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కరీంనగర్ జిల్లా మధురానగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి

కాంగ్రెస్, బీజేపీ అబద్ధాల ప్రచారం: మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కాంగ్రెస్ సర్కారుకు దమ్ముంటే ఈ నెలాఖరులోగా ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలను గుర్తించి, రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ ఇవ్వాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని వివరించారు. కేసీఆర్ భర్తీ చేసిన ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు ఇచ్చారో లేదో సీఎం రేవంత్, కోదండరాంరెడ్డి సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఏడు వేల స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు పరీక్ష నిర్వహిస్తే, సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు ఇచ్చి తామే ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీ గత ఐదేండ్లుగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని విమర్శించారు. వారెంటీ లేని గ్యారెంటీలతో కాంగ్రెస్ ప్రజలను ఆగం చేసిందని మండిపడ్డారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బండి సంజయ్ నయా పైసా అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు.

దళితబంధు కోసం డబ్బులు తీసుకోలేదు: ముత్తిరెడ్డి

జనగామ, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): దళితబంధు పేరుతో తాను డబ్బులు వసూలు చేసినట్టు వచ్చిన ఆరోపణలను జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం జనగామలో మీడియాతో మాట్లాడారు. తన కుటుంబ సమస్యను సాకుగా చూపి కొందరు తనకు జనగామ ఎమ్మెల్యే టికెట్ దక్కకుండా చేశారన్నారు. కేసీఆర్ స్వయంగా పిలిచి మాట్లాడి ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తాను మల్కాజిగిరి టికెట్ ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో తనను దెబ్బతీసేందుకు బద్ధిపడిగే కృష్ణారెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు.

ఫూలే విగ్రహం ఏర్పాటు చేస్తారా? లేదా?

- **బీసీలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయించాలి**
- **ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన అవసరం మాకు లేదు**
- **'గ్యాస్' పథకాన్ని ప్రియాంక ప్రారంభిస్తే.. నల్ల బెలూన్లతో నిరసన**
- **'జై తెలంగాణ' అనలేని వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**
- **ఫూలే విగ్రహ ఏర్పాటుపై 12న మహాధర్నా: ఎమ్మెల్సీ కవిత**

శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో జ్యోతిబా ఫూలే విగ్రహం ఏర్పాటు చేస్తారా? లేదా?, వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయిస్తారా? లేదా? కాంగ్రెస్ నాయకులు సూటిగా సమాధానం చెప్పాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హైదబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో ఫూలే విగ్రహ ఏర్పాటును కోరుతూ.. భారత జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 10 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. 12న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నామని చెప్పారు. వీలైనంత త్వరగా రాష్ట్రంలో బీసీ జన గణన చేపట్టాలని విన్నవించారు. కులగణన చేపట్టకపోతే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఏప్రిల్ 11 లోపు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రియాంక గాంధీ ఏ ప్రొటోకాల్‌లో ఉన్నారు?

రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇచ్చే ప్రభుత్వ పరమైన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ఏ హోదాలో పాల్గొంటారని కవిత ప్రశ్నించారు. 'ఆమె కనీసం ఏ ఒక్క గ్రామం నుంచి సర్పంచ్‌గా గెలిచిందా? ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా గెలిచారా? రాష్ట్రంలో ఏ ప్రొటోకాల్‌లో అయినా ఉందా? మీ పార్టీకి చెందిన ముఖ్యనాయకురాలైతే ఇంటికి పిలుచుకొని మీ మనువడికి ఆశీర్వాదం ఇప్పించుకోండి. కానీ, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రియాంక గాంధీని పిలుస్తామంటే నల్ల బుగ్గలు ఎగరేసి నిరసన తెలియజేస్తాం' అని హెచ్చరించారు. కాంగ్రెస్ కార్యక్రమాల కోసం సీఎం రేవంత్ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ హెలికాప్టర్‌లో వెళ్లి పార్టీ సభలో పాల్గొనడం ఏమిటని నిలదీశారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళ్లేందుకు ప్రత్యేక విమానాలకు అయ్యే ఖర్చు ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు.

జై తెలంగాణ అనలేదు

కేసీఆర్‌ను తిట్టడం తప్ప తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ నేతలు ఏం పనిచేస్తున్నారని కవిత ప్రశ్నించారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రోజు సోనియా కాళ్లమొక్కిన రేవంత్.. జై సోనియమ్మ అన్నారు తప్ప 'జై తెలంగాణ' అని నినదించలేదని విమర్శించారు. అమరవీరులకు ఒక్కసారి కూడా నివాళి అర్పించలేదని, అమరజ్యోతికి వెళ్లలేదని, అటువంటి వ్యక్తి కేసీఆర్‌పై ఆరోపణలు చేయడంపై తెలంగాణ ప్రజలు ఆలోచించాలని కోరారు.

ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన అవసరమే లేదు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన అవసరం బీఆర్‌ఎస్‌కు లేదని, ఆ పార్టీ నాయకులే పడగొడుతారని కవిత స్పష్టంచేశారు. నల్లగొండ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నేతలే ప్రభుత్వాన్ని పడగొడుతారని చెప్పారు. ప్రజలు తమను ప్రతిపక్షంలో ఉండమన్నారని, తాము ప్రతిపక్షంలోనే ఉంటామని తేల్చిచెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, బడ్జెట్ ప్రవేశపెట్టి రెండు రోజులు గడుస్తున్నా సీఎం స్పందించకపోవడం దారుణమన్నారు.

కేసీఆర్ నినాదం.. ప్రజల వద్దకే పాలన

ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చని రేవంత్‌ను తెలంగాణ ప్రజలంతా యూ-టర్న్ సీఎంగా పిలుస్తున్నట్టు కవిత చెప్పారు. ప్రజాదర్బార్ పెట్టి రోజూ ప్రజలను కలుస్తానని చెప్పిన రేవంత్ కేవలం ఆరోజు ఒక గంట మాత్రమే ప్రజలను కలిశారని.. ఇప్పుడు మంత్రులు.. అధికారులు వెళ్తున్నారని చెప్పారు. ఆ తాకిడి తట్టుకోలేక మళ్లీ జిల్లాల్లోనే ప్రజాపాలన పెడతామని ప్రకటించి.. కేసీఆర్ ఆచరించిన ప్రజల వద్దకే పాలన నినాదంలోకి వచ్చారని తెలిపారు.

వందరోజుల తర్వాతే.. మీ వంద పాపాలు..

శిశుపాలుడి వంద పాపాలు పండినట్లు వందరోజులకు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులు పండుతాయని, అప్పుడు ప్రజాక్షేత్రంలో తప్పకుండా నిలదీస్తామని కవిత తెలిపారు. నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసే అం శంపై పార్టీ ఎలా నిర్ణయిస్తే అలా అని వ్యాఖ్యానించారు. సమావేశంలో భారత జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు, మేడె రాజీవ్‌సాగర్, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ నేత గట్టు రామచందర్‌రావు పాల్గొన్నారు.

ఇది కుటుంబ పాలన కాదా?

కాంగ్రెస్ నాయకులు పొద్దస్తమానం కేసీఆర్ కుటుంబపాలన చేశారని అంటున్నారని, కానీ.. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు చెందిన 22 కుటుంబాలు ఆయా పదవులను అనుభవిస్తున్నారని కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 22 కుటుంబాలకు చెందిన నేతలకు కాంగ్రెస్ టికెట్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. గడ్డం వినోద్, వివేక్ సోదరులు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరులు, తండ్రీకొడుకులైన మైనంపల్లి హనుమంతరావు, రోహిత్‌రావు, భార్యాభర్తలైన ఉత్తమ్, పద్మావతిరెడ్డి, మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు కుమారుడు జువ్వాడి నరసింగారెడ్డి, ఆయన కుటుంబ సభ్యుడు కూచాడి శ్రీహరిరావు, మాజీ స్పీకర్ శ్రీపాదరావు కుమారుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ సింగాపురం రాజేశ్వరరావు మనుమడు వొడితెల ప్రణవ్, మాజీ మంత్రి రాజనరసింహ కుమారుడు దామోదర రాజనర్సింహా, మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి, పీ జనార్దన్‌రెడ్డి కుమార్తె పీ విజయారెడ్డి, కాంగ్రెస్ జాతీయ నేత పవన్ ఖేరా భార్య కోట నీలిమ, మాజీ ఎమ్మెల్యే నర్సిరెడ్డి మనువరాలు చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కుమారుడు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి కుమారుడు జయవీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ భార్య కొండా సురేఖ, మాజీ ఎంపీలు మల్లు అనంతరాములు, మల్లు రవిల సోదరుడు మల్లు భట్టి విక్రమార్క, ఇప్పుడాయన భార్య నందిని.. మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి, పట్లోళ్ల సంజీవరెడ్డి వంటి అనేక కుటుంబాలకు కాంగ్రెస్ టికెట్లు ఇచ్చిందని వివరించారు.

కాంగ్రెస్‌ను ఇక నమ్మరు

- **కేంద్రంతో కొట్లాడేది బీఆర్‌ఎస్సే**
- **పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి**
- **కొత్తగూడెం సన్నాహక సమావేశంలో నిరంజన్‌రెడ్డి**

కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వనమా తదితరులు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్ పార్టీని ఇక ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. అబద్ధాలు, విషపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందున్నది ముసళ్ల పండుగ అని హెచ్చరించారు. కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అధ్యక్షతన కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ భవన్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కొట్లాడేది బీఆర్‌ఎస్ ఎంపీలు మాత్రమేనని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏనాడూ పార్లమెంట్‌లో పెదవి విప్పలేదని విమర్శించారు. ప్రజలకు నీతులు చెప్పే రాహుల్‌గాంధీ సీఎం రేవంత్‌రెడ్డికి నీతివాక్యాలు చెప్పాలని సూచించారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి, ప్రత్యామ్నాయ ఉపాధి చూపించకపోవడం వల్ల ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారి కుటుంబాలకు న్యాయం చేయకపోతే తమ పార్టీ తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా ఏమిటో చూపిద్దామని పిలుపునిచ్చారు. 2018 ఎన్నికల్లో మాదిరిగానే ఖమ్మం ఎంపీ స్థానం నుంచి నామా అద్భుత విజయం సాధిస్తారని చెప్పారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

చంపినోళ్లే సంతాప సభ పెట్టినట్టు!

- **ఇంద్రవెల్లిలో వందల మందిని పొట్టన పెట్టుకున్నది కాంగ్రెస్సే**
- **ఆదివాసీలకు సోనియా, రాహుల్‌తో క్షమాపణలు చెప్పించాలి: సుమన్**
- **రూ.22 కోట్లి ఇచ్చి జోడేఘాట్‌ను అభివృద్ధి చేసిండు కేసీఆరే: జోగు**
- **ఇంద్రవెల్లి అమరవీరులకు 10 లక్షలు ఇవ్వాలి: భూక్యా జాన్సన్‌నాయక్**

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్. చిత్రంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్సీ దండె విఠల్, బీఆర్‌ఎస్ నేత భూక్యా జాన్సన్‌నాయక్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ఇంద్రవెల్లిలో సీఎం రేవంత్ సభ చూసినోళ్లంతా.. 'చంపినోళ్లే సంతాప సభ పెట్టినట్టుంది' అని మాట్లాడుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. ఆదివాసీలకు రేవంత్‌తో కాకుండా.. సోనియా, రాహుల్, ఖర్గేలతో క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ మాట్లాడారు. కండ్లుండీ ఆదిలాబాద్ అభివృద్ధిని చూడలేని కబోది సీఎం రేవంత్ అని ఎద్దేవా చేశారు. విష జ్వరాలతో బాధపడే గిరిజనులకు సీఎంగా కేసీఆర్ వైద్య సదుపాయాలు కల్పించి, బిడ్డలకు గురుకులాలు పెట్టించారని గుర్తుచేశారు. ఎవరు ఎవర్ని కలుస్తున్నారు? ఎవరు బేర సారాలు చేస్తున్నారు? అనేది ప్రజలకు తెలుసునని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ల నుంచి పదవీ గండం ఉండటంతో రేవంత్‌లో అభద్రత పెరిగిపోయిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.7 వేల కోట్లు రైతుబంధు కోసం ఉంచితే.. రేవంత్ రాగానే వాటిని కాంగ్రెస్ నేతకు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు బదిలీ చేశారని విమర్శించారు. రేవంత్ రాకతో తెలంగాణలో రాక్షస రాజ్యం మొదలైందని ఆరోపించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పార్లమెంటు ఎన్నికల్లోపే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. రేవంత్ ఉమ్మడి ఆదిలాబాద్ పర్యటనకు వచ్చింది కేవలం ఓట్ల కోసమేనని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో దొరికిన రేవంత్.. ఎంపీల అమ్మకం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని దుయ్యబట్టారు. ఇంద్రవెల్లి అమరుల సాక్షిగా రేవంత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇంద్రవెల్లిలో వందల మంది ఆదివాసీలను పొట్టన బెట్టుకున్నదే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. రేవంత్‌కు ఇంద్రవెల్లి అమరుల స్థూపాన్ని తాకే హక్కే లేదని స్పష్టంచేశారు. ప్రజా సంఘాల ఒత్తిడితో నిర్మించిన స్థూపం వద్దకు.. గద్దర్‌ను సైతం కాంగ్రెస్ నాయకులు వెళ్లనివ్వలేదని చెప్పారు. కేసీఆర్ సీఎం అయ్యాకే స్థూపం దగ్గరకు వెళ్లే స్వేచ్ఛ అందరికీ దొరికిందని గుర్తుచేశారు. నాగోబా దేవాలయానికి కేసీఆర్ ప్రభుత్వం నిధులు ఇస్తే.. రేవంత్ ప్రారంభోత్సవాలు చేశారని పేర్కొన్నారు. జోడేఘాట్‌ను రూ.22 కోట్లతో కేసీఆర్ అభివృద్ధి చేశారని వెల్లడించారు. గిరి వికాసం కింద 3 వేలకు పైగా వ్యవసాయ బోర్లను గిరిజనులకు అందజేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని, కేసీఆర్ హయాంలో 13 మధ్యతరహా ప్రాజెక్టులను రూ.800 కోట్లతో పూర్తి చేశామని చెప్పారు.

ఇకనైనా కారుకూతలు బంద్‌పెట్టాలి: భరత్

ఇకనైనా సీఎం రేవంత్, మంత్రులు కారుకూతలు మానుకొని.. రాష్ట్ర సమస్యలపై కేంద్రాన్ని నిలదీయాలని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కోరారు. కృష్ణా ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ కేంద్రం వద్ద జీ హుజూర్ అన్నది కాబట్టే మన ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించారని తెలిపారు. ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ డిమాండ్ చేశారు. విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయని, రైల్వేలో తీవ్ర అన్యాయం జరిగిందని, 14 లక్షల కేంద్ర ప్రభుత్వ ఖాళీలపై కాంగ్రెస్ స్పందించాలని వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు.

అమరవీరుల స్థూపం శుద్ధి

ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపాన్ని శనివారం ఆదివాసీ సంఘాల నేతలు పాలతో శుద్ధి చేశారు. స్థూపం, జెండా గద్దె వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం కొందరు నాయకులు పాదరక్షలతో అమరవీరుల స్థూపం వద్దకు వచ్చి అపవిత్రం చేశారని తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. - ఇంద్రవెల్లి

కోటి ఇచ్చి.. ఐదు కోట్ల ఖర్చా?

- **ప్రభుత్వంపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధ్వజం**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఫిబ్రవరి 3: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ సభకు రేవంత్ సీఎం హోదాలో వచ్చి కేవలం రూ.కోటి మంజూరు చేసి, సభకు మాత్రం రూ.5 కోట్లు దుబారా చేశారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండిపడ్డారు. 2014లో మొదటిసారి సీఎం హోదాలో వచ్చిన కేసీఆర్ రూ.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. రెండోసారి వచ్చినప్పుడు కుమ్రంభీం పేరిట జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రాంతానికి ఎంతో చేసిన కేసీఆర్‌పై రేవంత్ నోరుపారేసుకోవడంపై ఆమె మండిపడ్డారు. శనివారం ఆమె జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ సభ చూస్తుంటే కాల్చి చంపినవారే కన్నీరు పెట్టినట్టుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసిన నిధులను, తాము చేసినట్టుగా గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని బీజేపీపై చిన్న మాట కూడా మాట్లాడలేదని ధ్వజమెత్తారు.